నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY








సంపుటి : 13 సంచిక : 80 రంగారెడ్డి | శుక్రవారం 17 జూలై 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 17-07-2026 | Friday | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada


# బోనాలు షురూ..!

## తెలంగాణలో బోనాల జాతర ప్రారంభం..

### భక్తజన సందోహంగా గోల్కొండ

### పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్



**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**
తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే చారిత్రాత్మక గోల్కొండ బోనాల జాతర అత్యంత వైభవంగా గురువారం ప్రారంభమైంది. ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా, మొదటి బోనాన్ని గోల్కొండ కోటపై వెలసిన జగదాంబిక అమ్మవారికి కుమ్మరులు సమర్పించారు. సాంప్రదాయబద్ధంగా 11 బోనాలతో కోటకు చేరుకున్న భక్తులు అమ్మవారికి ఘనంగా మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి బంగారు బోనాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సు ఖసంతో షాలతో విలసిల్లాలని వారు ఆకాంక్షించారు.తొలి బోనం సమర్పణతో గోల్కొండ కోట పరిసర ప్రాంతాలన్నీ భక్తుల కోలాహలంతో, (మిగతా 3 లో..)

# రైతులకు కరెంట్ ఇవ్వకపోగా భూములపై ట్యాక్స్ వేస్తారట..

## రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్



**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :**
రిటైర్డ్ ఇంజినీర్లు, తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి గేట్లు ఎత్తొచ్చని చెప్తే.. ఆ నీళ్లు ఎత్తొచ్చని చెప్పిన ఇంజినీర్లను జైళ్లలో పెడతమని, బెల్ట్‌తో కొడ్తమని రాజకీయాలు చేస్తున్నది మీరని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతులకు నీరందించండి..కరెంట్ ఇవ్వండి..విద్యుత్ సామర్థ్యం ఉన్నది.. విద్యుత్ ప్లాంట్లు ఉన్నయి. బొగ్గు లేక విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. దృష్టి పెట్టండి అని ప్రభుత్వాన్ని ముల్లు కట్టె పెట్టి నిద్రలేపుతున్నాం. మీకు విషయాలు చెబుతున్నమన్నారు.రాజకీయాలు చేయడం మీరు మానండి.. విద్యుత్ ఉత్పత్తి పెంచండి.. రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వండని ప్రభుత్వానికి హరీశ్ రావు సూచించారు.. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ చేస్తారట. కమీషన్ల కోసం గ్రీన్ ఎనర్జీ పాలసీని నిలిపేశారు. నాణ్యమైన బొగ్గును వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. దేవాదులకు నీళు అందడానికి కారణం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోతలు-వాతలు తప్ప ఏమీ లేవన్నారు. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ వేస్తారట. రైతులకు నీళ్లు ఇవ్వమంటే రక్తం పారిస్తామంటున్నారు. రెండు పంటలకు బోనస్ ఎగ్గొట్టారు. విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. విద్యుత్ సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి చేయలేకపోతున్నారు. 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటే 3100 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం 33 శాతం మాత్రమే. ఎల్‌నినో వస్తుందని తెలిసినా ముందస్తు ప్రణాళిక లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక వేత్తలు, ప్రజలపై భారం పడుతోందన్నారు.

# నేడు తెలంగాణ మంత్రివర్గ అత్యవసర భేటీ..

### కీలక నిర్ణయాలపై ఉత్కంఠ

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**



సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నేడు అత్యవసరంగా సమావేశం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలోని 6వ అంతస్తులో కేబినెట్ మీటింగ్ హాల్‌లో ఈ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కేబినెట్ భేటీ నేపథ్యంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ప్రభుత్వ కార్యదర్శులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, మూసీ పునరుజ్జీవనం ఫేజ్-1 పనులు, వర్షాభావ పరిస్థితులు, అలాగే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది. ఇక రాష్ట్రంపై 'ఎల్‌నినో' ప్రభావం, (మిగతా 3 లో..)

# కడుపులో విషం, నోట్లో అబద్దాలు..

### బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ఫైర్

**నిర్భయవార్త ప్రతినిధి : ఖమ్మం:**



బీఆర్ఎస్ పార్టీని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఎప్పుడూ సరిగా ఆదరించడంలేదనే కక్షతో అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్ట్‌తో పాటు పలు నీటి ప్రాజెక్ట్‌లను ఆ పార్టీ నాయకులు గాలికి వదిలేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దుయ్యబట్టారు. గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను మంత్రి సందర్శించారు. ప్రాజెక్ట్ సందర్శన అనంతరం ఏర్పాటైన పాత్రికేయుల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ పరిస్థితిని చూస్తే కడుపుతరుక్కుపోతోందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీకి ఈ ప్రాంతీయులు ఓట్లు వేసి సీట్లు ఇవ్వనందున గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఉపయుక్తమైన సీతారామ ప్రాజెక్ట్‌కు అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రతిపక్షపాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకొని (మిగతా 3 లో..)

# సీపీ శ్వేత కొత్త మార్క్..

### ప్రజలకు ఇబ్బందులు తగ్గించేలా భద్రతా ఏర్పాట్లలో మార్పులు

### కాన్వాయ్‌లో ఎస్కార్ట్ వాహనానికి గుడ్‌బై

### ప్రజా సౌకర్యానికే ప్రాధాన్యం

### నక్సల్స్ ప్రభావం తగ్గిన నేపథ్యంలో నిర్ణయం

### ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించే చర్యలు

### పోలీస్ కమిషనర్ నిర్ణయంపై ప్రశంసలు




**నిర్భయవార్త ప్రతినిధి :వరంగల్:**
వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ప్రజా సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. భద్రతా ఏర్పాట్లలో మార్పులు చేస్తూ ప్రజలకు అనవసర ఇబ్బందులు కలగకుండా చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతం నక్సల్స్ ప్రభావం గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గిన నేపథ్యంలో కమిషనర్‌కు కల్పిస్తున్న వ్యక్తిగత [illegible] పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న 2o2 భద్రతా విధానానికి బదులుగా ఇకపై 1o1 విధానాన్ని అమలు చేయనున్నారు. దీంతో ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న 4 గన్‌మెన్ల స్థానంలో ఇకపై 2 మంది మాత్రమే కమిషనర్ భద్రతను (మిగతా 3 లో..)

# తెలంగాణలో 'ఐసీఎంఆర్ డ్రోన్' విప్లవం..

## 15 రోజుల టీబీ టెస్ట్ ఇక 5 రోజుల్లో!

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**





భారత వైద్య రంగంలో సాంకేతికతను జోడించి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ చేపట్టిన వినూత్న ప్రయోగం అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఐసీఎంఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఐ-ఐ=ూచీజు' ప్రాజెక్ట్ ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ సమయం తగ్గడమే కాకుండా, రోగుల జేబుకు చిల్లు పడకుండా ఆదా అయిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

**15 రోజుల నుంచి 5 రోజులకు..**
అయితే, సాధారణంగా గ్రామాలు, మూరు ప్రాంతాల రోగుల నుంచి టీబీ కఫం నమూనాలను సేకరించి, లాబొరేటరీలకు పంపి రిపోర్టు వచ్చేసరికి ఇది వరకు సగటున 15 రోజుల సమయం పట్టేది. అయితే, ఈ డ్రోన్ ఆధారిత రవాణా వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ సమయం 15 రోజుల నుంచి కేవలం 5 రోజులకు తగ్గిపోయింది. దీంతో వ్యాధిని ముందే గుర్తించి, త్వరితగతిన వైద్యం అందించడానికి వీలవుతోంది. గతంలో రోగులు టీబీ పరీక్షల కోసం సుదూర ప్రాంతాల్లోని కేంద్రాలకు ప్రయాణించడం వల్ల ప్రయాణ ఖర్చులు, ఆ రోజు కూలి నష్టపోవడం వంటి
(మిగతా 3 లో..)

# రథయాత్రలో అపశ్రుతి

**ఒడిశా:**



ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో గురువారం రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన ఎమర్జెన్సీ సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.జాతీయ మీడియా కథనాల ప్రకారం.. రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు
(మిగతా 3 లో..)

నిర్భయవార్త

సంపాదకీయం

గురువారం 16 జులై 2026

# ఓటు 'హక్కు'

ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం ఒక హక్కు మాత్రమే కాదు. అది రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత విలువైన రాజకీయ అధికారం. ఆ హక్కును వినియోగించే అవకాశాన్ని కల్పించే ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా ఉంటుందో, ప్రజాస్వామ్యమూ అంత బలంగా ఉంటుంది. ప్రస్తుత బిజెపి పాలనలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -ఎస్ఐఆర్) కార్యక్రమం గతానికి భిన్నంగా వివాదాస్పదంగా మారింది. వివిధ రాష్ట్రాలలో ఎస్ఐఆర్ ప్రక్రియ అమలవుతున్న తీరు ప్రజల్లో అనుమానాలకు, రాజకీయ పార్టీల్లో అభ్యంతరాలకు దారి తీస్తోంది. మాజీ ఎన్నికల కమిషనర్లు సైతం ఆందోళనలు వ్యక్తం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్రంలో ఈ నెల14తో ముగియాల్సిన ప్రత్యేక సవరణ గడువును ఎన్నికల సంఘం మరో 10 రోజులు పొడిగించి 24వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ నిర్ణయం యాదృచ్ఛికంగా, ఎన్నికల సంఘం తనంతట తాను తీసుకున్నది కాదు. విస్తృత ప్రజా బాహుళ్యం నుండి క్షేత్ర స్థాయిలో వస్తున్న ఒత్తిడితో పాటు, వివిధ రాజకీయ పార్టీలు చేసిన విజ్ఞప్తుల మేరకే ఈ పొడిగింపు జరిగింది. ఈ విజ్ఞప్తుల ఆధారంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడం, దానికి స్పందిస్తూ మరో పది రోజుల పాటు గడువును పొడిగిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొలుత నిర్ణయించిన గడువుకు ప్రకియ మొత్తం పూర్తి కావడం సాధ్యం కాదని రాష్ట్ర ఎన్నికల అధికారులు స్వయంగా కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇది ఓటు హక్కుపై ప్రజానీకంలో వ్యక్తమవుతున్న ఆందోళనలకు పరోక్ష అంగీకారమే. అయినా, ముసాయిదా ఓటర్ల జాబితాను ఈ నెల 31వ తేదీన విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం ఎస్ఐఆర్ పనిలో ఉన్న సిబ్బందిపై ఒత్తిడి పెంచే చర్యే! మిగిలిన కొద్ది రోజుల్లోనే లక్షలాది దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాల్సిన పరిస్థితి వారికి ఏర్పడింది.రాష్ట్రంలో సుమారు 4.16 కోట్ల మంది ఓటర్లు ఉండగా, దాదాపు అందరికి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు ఎన్నికల సంఘ అధికారులు చెబుతున్నారు. అయితే, అదే స్థాయిలో నింపిన ఫారాలు ఓటర్ల నుండి వెనక్కి రాలేదు. వీటిలో పెద్ద సంఖ్యలో ఫారాలు సేకరించడం సాధ్యం కాదని, వాటి వివరాలు రావడానికి ఏ మాత్రం అవకాశం లేదని (అన్ కలెక్టబుల్) అధికారులు చెబుతుండటం ఆందోళనకరం. అధికారిక సమాచారం ప్రకారమే రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 43,39,523 మంది ఓటర్ల వివరాలు సేకరించే అవకాశం లేదని అధికారులు తేల్చారు. అంటే ఈ ఓట్లన్నీ రద్దయ్యే ప్రమాదం ఉంది. ఇది పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ తొలగించిన ఓట్లకు దాదాపు సగం కావడం గమనార్హం. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2.92 లక్షలు, తిరుపతి జిల్లాలో 2.91 లక్షలు, కర్నూలు జిల్లాలో 2.69 లక్షల ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు సేకరించడం సాధ్యం కాదన్నది అధికారులు చెబుతున్న సమాచారం. జిల్లాలోని మొత్తం ఓటర్లలో ఈ తరహా అన్ కలెక్టబుల్ ఫారాల శాతం తిరుపతిలో అత్యధికంగా 16.50, నెల్లూరులో 14.81, కర్నూలులో 12.90 గా ఉంది. పోలవరం జిల్లాలో అత్యల్పంగా 40,186 ఫారాలు ఈ జాబితాలో ఉన్నాయి. చనిపోవడంతో పాటు, వలసలు పోవడం, అసంపూర్ణ వివరాలు, ఆధార పత్రాల లేమి, చిరునామా నిర్ధారణ కాకపోవడం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు చెబుతున్నారు. ఈ దరఖాస్తులను ఎలా పరిష్కరిస్తారు? వాటిలోని అర్హులైన ఓటర్ల హక్కును ఎలా రక్షిస్తారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఇ.సి అధికారుల నుండి రావడం లేదు. మరోవైపు అన్ని వివరాలతో అందిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా నూరు శాతం పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజలకు ఓటు హక్కును ఇవ్వడానికన్నా తొలగించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనపడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదన్న ఆయన 'ఓటరు జాబితాల ప్రక్షాళన అవసరమే కానీ దాని ఉద్దేశం జాబితాను కుదించడం కాదు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు అందులో ఉండేలా చూడడమే దాని లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఓటు హక్కు ఎన్నికల సంఘం ప్రసాదించిన దయాదాక్షిణ్యం కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కు.' అని కూడా ఆయన అన్నారు. పెద్ద సంఖ్యలో పేర్లు తొలగిపోయే పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్యం ఒక్కసారిగా కూలిపోదని, ఇలాంటి చిన్న చిన్న పరిపాలనా తప్పిదాల ద్వారానే క్రమంగా బలహీన పడుతుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ఏ మాత్రం విస్మరించలేనివి. ఎన్నికల సంఘం చెబుతున్నట్లు నకిలీ ఓట్లను, మరణించిన వారి పేర్లను, ద్వంద్వ నమోదులను నివారించడం ముఖ్యమే. అయితే, ఆ పేరుతో అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదు. ఎన్నికల స్వచ్ఛత ఎంత ముఖ్యమో, ఓటు హక్కు పరిరక్షణ అంతకంటే ముఖ్యమైనది. ఒక నకిలీ పేరు ఉండటం కంటే ఒక నిజమైన ఓటరు పేరు తొలగిపోవడమే ప్రజాస్వామ్యానికి పెద్ద నష్టం. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం గుర్తించాలి. కేవలం గడువు పొడిగింపుతో బాధ్యత ముగిసినట్లు భావించకూడదు. పరిశీలనకు వీలుకాదంటూ పక్కన పెడుతున్న ప్రతి దరఖాస్తును మరోసారి క్షుణ్ణంగా చూడాలి. తిరస్కరణకు గురయ్యే ప్రతి ఓటరుకి అభ్యంతరం చెప్పే అవకాశం కల్పించాలి. వలస కార్మికులు, వృద్ధులు, వికలాంగులు, విదేశాల్లో ఉన్నవారికి ప్రత్యేక విధానం అమలు చేయాలి. ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలి. ఓటు హక్కును కాపాడటమంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే! అదే ఎన్నికల సంఘం ముందున్న అత్యంత ముఖ్యమైన రాజ్యాంగ బాధ్యత.

# కార్పొరేట్ అనుకూల చట్టాలు
# కె.జి.బేసిన్ గ్యాస్, ఆయిల్ దోపిడీ

భారతదేశానికి ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సహజ వనరులలో ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, ముఖ్యంగా కృష్ణా-గోదావరి (కె.జి) బేసిన్ అత్యంత కీలకమైనవి. దేశ ఇంధన భద్రతలో ఇవి ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. అయితే, ఇటీవల కాలంలో ఈ ప్రజా సంపదను ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు అడ్డగోలుగా ధారాదత్తం చేయడానికి ప్రభుత్వాలు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రజా ప్రయోజనాలను, పర్యావరణాన్ని విస్మరించి కేవలం రిలయన్స్, వేదాంత వంటి ప్రైవేటు సంస్థల లాభార్జనే ధ్యేయంగా చట్టాలను సవరించడం దేశీయ ఆర్థిక సార్వభౌమత్వానికి గొడ్డలిపెట్టుగా మారింది.




**ఆయిల్ ఫీల్డ్స్ సవరణ బిల్లు 2024: కార్పొరేట్ అనుకూల చట్టం**

దేశీయ చమురు, గ్యాస్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'ది ఆయిల్ ఫీల్డ్స్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) సవరణ బిల్లు, 2024'ను తీసుకువచ్చింది. ఈ బిల్లు 2024 డిసెంబరు 3న రాజ్యసభలోనూ, 2025 మార్చి 12న లోక్‌సభలోనూ ఆమోదించబడింది. ఈ చట్టం పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు సాగిలపడే విధంగా రూపొందించబడింది.

**క్రిమినల్ శిక్షల రద్దు -- నేరరహితం చేయడం**

1948 నాటి పాత చట్టం ప్రకారం, పర్యావరణానికి ముప్పు తెచ్చినా లేదా నిబంధనలు ఉల్లంఘించినా నిందితులకు 6 నెలల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే నిబంధనలు ఉండేవి. తప్పు చేసిన వారు సమాజంలో తల దించుకునేలా, భయం కలిగి ఉండేలా ఆ శిక్షలు ఉండేవి. కానీ, ప్రస్తుత సవరణ బిల్లు వ్యాపార వాతావరణాన్ని సులభతరం చేయడం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) అనే పేరుతో జైలు శిక్షను పూర్తిగా రద్దు చేసింది. దీని స్థానంలో కేవలం రూ.25 లక్షల జరిమానాను ప్రవేశపెట్టింది. వందల, వేల కోట్లు అక్రమంగా సంపాదించే కార్పొరేట్ శక్తులకు రూ.25 లక్షల జరిమానా అత్యంత స్వల్పమైన మొత్తం. డబ్బుతో శిక్ష నుంచి బైటపడేందుకు, ఒక్క రోజు కూడా జైలుకు వెళ్లకుండా తప్పించుకునేందుకు ప్రభుత్వమే ఈ చట్టం ద్వారా దారి చూపిస్తోంది.

**ప్రభుత్వ మౌలిక సదుపాయాల లూటీ**

ఈ బిల్లు ప్రకారం, మన దేశ అగ్రగామి ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఒ.ఎన్.జి.సి దశాబ్దాలుగా ఎంతో కష్టపడి, భారీ పెట్టుబడులతో ఏర్పాటు చేసుకున్న రిగ్గులు, పైప్‌లైన్లు, ఉత్పత్తి, ప్రాసెసింగ్ సౌకర్యాలను ప్రైవేటు ఆపరేటర్లు చట్టబద్ధంగా ఉచితంగా వాడుకోవచ్చు. ఇది ప్రైవేట్ సంస్థల పెట్టుబడి, నిర్వహణ ఖర్చులను భారీగా తగ్గిస్తుంది. అంటే, కష్టమంతా ప్రభుత్వ సంస్థది, లాభమంతా ప్రైవేట్ కంపెనీలది అన్నట్లుగా ఈ విధానం ఉంది.

**కృష్ణా జిల్లా కాజ బ్లాక్ వ్యవహారం -- 'వేదాంత'కు అయాచిత లబ్ధి**

కృష్ణా జిల్లాలోని పామర్రు, కాజ బ్లాక్ పరిధిలో ఒ.ఎన్.జి.సి సంస్థ తన సొంత ఖర్చుతో విస్తృతంగా అన్వేషణ జరిపి, భారీగా హైడ్రోకార్బన్ నిల్వలను గుర్తించింది. ఆన్-షోర్‌లో 115 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ విలువైన బ్లాక్‌ను వెలికితీసేందుకు, ప్రభుత్వం ఒఎన్ జిసిని కాదని వేదాంత కంపెనీకి అనుమతులు మంజూరు చేసింది.రూ.650 కోట్ల పెట్టుబడితో 30,000 బారళ్ల క్రూడ్ ఆయిల్, 30 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తామని 'వేదాంత' చెబుతోంది. ఒకవేళ అక్కడ చమురు దొరకకపోతే ఆ నష్టాన్ని భరించేది ఒఎన్ జిసి. కానీ నిక్షేపాలు దొరికిన తర్వాత అయాచితంగా లాభాలు పొందేది మాత్రం 'వేదాంత'. దీనినే లాభాలు ప్రైవేటుకు, నష్టాలు జాతీయాకరణకు అంటారు.

**స్థానిక ప్రజలకు, పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు**

ఈ సవరణ బిల్లు, ప్రైవేట్ సంస్థల ప్రవేశం వల్ల ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి, స్థానిక ప్రజల జీవనోపాధికి తీవ్రమైన నష్టం వాటిల్లనుంది. పర్యావరణ క్షీణత, ఫ్రాకింగ్ బిల్లు ద్వారా సంప్రదాయ గ్యాస్, ఆయిల్‌తో పాటు 'షేల్ గ్యాస్' వెలికితీతను సులభతరం చేశారు. షేల్ గ్యాస్ తీయడానికి వాడే 'ఫ్రాకింగ్' పద్ధతి వల్ల భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతాయి, అంతేకాక భూమి కంపించే ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ఒకే అనుమతి విధానంతో పర్యావరణ అనుమతులు వేగంగా ఇవ్వడం వల్ల పర్యావరణ రక్షణకు ఎటువంటి గ్యారంటీ లేకుండా పోయింది.

**జీవనోపాధి దెబ్బతినడం**

కాజ, కెజి బేసిన్ లాంటి తీర ప్రాంతాలలో పైప్‌లైన్లు వేయడం, రిగ్గులు పెట్టడం వల్ల స్థానిక మత్స్యకారుల వేట దెబ్బతింటుంది. అలాగే బందరు కాలువ ద్వారా పొలాలకు నీరు పెట్టుకుంటున్న వ్యవసాయ భూములు కలుషితమై రైతులు తీవ్రంగా నష్టపోతారు.

**'వేదాంత' కంపెనీ వివాదాల చరిత్ర**

'వేదాంత'సంస్థకు పర్యావరణ విధ్వంసం చేసిన చరిత్ర ఉంది. తమిళనాడు తూత్తుకుడిలోని స్టెరిలైట్ కాపర్ ప్లాంట్ కాలుష్యానికి వ్యతిరేకంగా 2018లో స్థానికులు నిరసన చేసినప్పుడు జరిగిన పోలీసు కాల్పుల్లో 13 మంది మరణించారు. ఒడిశాలోని నియంగిరి కొండల్లో బాక్సైట్ తవ్వకాల కోసం గిరిజనుల హక్కులను కాలరాచినందుకు 2013లో సుప్రీం కోర్ట్ అక్కడ మైనింగ్‌ను నిషేధించింది. ఒడిశా ఝార్సుగూడ ప్లాంట్ విషపూరిత వ్యర్థాలను పొలాల్లోకి వదలడం, సెబీ చేత షేర్ల అవకతవకలపై నిషేధానికి గురికావడం, జాంబియా దేశంలో పన్ను ఎగవేత, పర్యావరణ నష్టం కారణంగా గనుల జప్తును ఎదుర్కోవడం వంటి ఎన్నో వివాదాలు 'వేదాంత' చుట్టూ ఉన్నాయి. అటువంటి సంస్థకు మన బందరు కాలువ, కాజ ప్రాంత పర్యావరణాన్ని అప్పగించడం అత్యంత ప్రమాదకరం.

**నార్వే దేశ నమూనా -- మనకెందుకు సాధ్యం కాదు?**

ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాలలో ఒకటైన నార్వేలో సహజ వనరులు ప్రజల ఉమ్మడి ఆస్తిగా ఉన్నాయి. అక్కడ చమురు, గ్యాస్ ద్వారా వచ్చే లాభాలను ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా ప్రభుత్వ ఆధీనంలోని సార్వభౌమ నిధిలో జమ చేసి, ప్రజల ఉచిత విద్య, వైద్యం, సామాజిక భద్రతకు వాడుతున్నారు.కానీ మన దేశంలో రిలయన్స్ వంటి కంపెనీలు కెజి బేసిన్ లోని వనరులను వెలికితీసి ప్రపంచవ్యాప్తంగా అమ్ముకుంటున్నాయి. రష్యా నుండి చౌకగా చమురు దిగుమతి చేసుకుని యూరప్‌కు ఎక్కువ రేట్లకు అమ్ముకుంటున్న రిలయన్స్, ఆంధ్రప్రదేశ్ ప్రజల అవసరాలకు మాత్రం గ్యాస్ కేటాయించడం లేదు. డబ్బులు తీసుకుని కూడా ఇవ్వకుండా, ఇక్కడి గ్యాస్‌ను 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్రలకు తరలిస్తున్నారు.

**న్యాయవ్యవస్థ నిర్వీర్యం -- వివాదాల పరిష్కారం**

ఈ కొత్త బిల్లు ప్రకారం వివాదాల పరిష్కారానికి కోర్టులకు ఎటువంటి అధికారమూ లేదు. కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ లేదా అంతకంటే ఎక్కువ హోదా ఉన్న ఒక అధికారి మాత్రమే వివాదాలను పరిష్కరిస్తారు. అవినీతి వ్యవస్థలో ఇటువంటి అధికారులు ప్రజానుకూలంగా తీర్పులు ఇస్తారని భావించలేము. గతంలో ఒ.ఎన్.జి.సి వెలికితీసిన గ్యాస్‌ను రిలయన్స్ దొంగతనంగా అమ్ముకున్న వ్యవహారంలో ప్రభుత్వం, కోర్టులు ఏమీ చేయలేక చివరకు రాజీ పడమని సలహా ఇవ్వడమే దీనికి నిదర్శనం.సహజ వనరులు ప్రజల సొత్తు. ప్రైవేట్ కంపెనీల ప్రయోజనాలు ఎప్పుడైనా ప్రజల ప్రయోజనాలకు లోబడి ఉన్నప్పుడే సమాజం పురోగమిస్తుంది. విలువైన ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడం వల్ల ప్రజలు శాశ్వతంగా పేదరికంలోనే ఉండిపోతారు. పాలకవర్గ పార్టీలు ఈ అన్యాయాన్ని విమర్శించకపోవడం శోచనీయం. మన ప్రయోజనాలను, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా చైతన్యవంతులై, ఇందుకోసం కృషి చేసే వేదికల ద్వారా ఐక్యంగా, పోరాడవలసిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది.

**-డా. కొల్లా రాజమోహన్**

# వాహనదారులకు షాక్

ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను వాహన వినియోగదారులపై బలవంతంగా




రుద్దడం ఆందోళనకరం. ప్రస్తుతానికి ఇ-20 పెట్రోల్‌ను అందిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇథనాల్ శాతాన్ని మరింతగా పెంచుతూ ఇ - 85, ఇ - 100 కూడా తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందన్న ప్రచారం వాహన వినియోగదారులకు కలవరపాటే. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో డాలర్ల వినియోగాన్ని తగ్గించడానికి, రైతులకు ప్రయోజనకరంగా ఉండటానికి ఈ విధానాన్ని తీసుకొచ్చామంటున్న కేంద్రం ప్రకటనలు.. వాస్తవంలో కోట్లాదిమంది సామాన్య వాహనదారుల ప్రయోజనాలకు, రవాణా రంగానికి ప్రాణ సంకటం. తాజా విధానం భవిష్యత్‌లో ఆహార సంక్షోభానికి దారితీసే ముప్పు కాచుకుని వుంది. పెట్రోల్‌లో ఇథనాల్ వినియోగించడంపై దశాబ్దాలుగా చర్చ సాగినా, 2021లో నీతి ఆయోగ్ ఈ విధానాన్ని ఆమోదించింది. 2022లో నేషనల్ పాలసీ ఆఫ్ బయోఫ్యూయల్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇథనాల్‌ను క్రమంగా పెంచుతూ ప్రస్తుతానికి ఇ - 20 అమలులోకి తీసుకొచ్చారు. 2023 తరువాత తయారైన వాహనాలు వీటిని వినియోగించుకోగలవని, అంతకు ముందు తయారైన వాహనాల ఇంజన్లు, రబ్బరుతో తయారు చేసిన పరికరాలు దెబ్బ తింటున్నాయని నిపుణులు చెబుతున్నారు. అందుకోసం కొన్ని కంపెనీలు ద్విచక్ర వాహన కిట్లను రూ.12 వేలకు పైగా, కార్ల కిట్లను రూ.25 వేలకు పైగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాయి. పాత వాహనాలను నడుపుకుంటూ బతుకు బండి లాగుతున్న సామాన్యుడు ఈ పరిణామాలను తట్టుకోవడం కష్టం. ఇ -20 వల్ల 3 - 5 శాతం మైలేజి తగ్గుతుందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖే అంగీకరించింది. పూర్తి స్థాయిలో ఇథనాల్ వినియోగిస్తే మైలేజిలో 65 శాతమే వస్తుంది. ఇదే విధానాన్ని అనుసరిస్తున్న బ్రెజిల్ వాహనాల్లో వినియోగించే ఇథనాల్ ధరను పెట్రోల్ ధర కంటే 30 శాతం తక్కువకు విక్రయించడంతోపాటు ఏ ఇంధనం కొనుక్కోవచ్చో ఎంపిక చేసుకునే స్వేచ్ఛను వినియోగదారులకిచ్చింది. ఫ్లెక్సీ ఫ్యూయల్ వాహనాలకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇథనాల్ తయారీకి ఎక్కువ ఖర్చు, తయారీదారులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నందున రాయితీలేవీ ఇవ్వలేమని మోడీ సర్కారు చేతులెత్తేయడం సరికాదు. ఇ-20తోపాటు ఇ-10 పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలన్న వినియోగదారుల విజ్ఞప్తిని పెడచెవినపెట్టడం అసమంజసం. ఎం.ఎస్. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయకుండా... ఇథనాల్‌తో రైతులకు ప్రయోజనం కల్పిస్తున్నామన్నది వట్టిమాటే! వ్యవసాయ విధానంలో భాగంగా ఉండాల్సిన ఇథనాల్ తయారీని స్వతంత్రంగా చూపడం అసమంజసం. పెట్రోల్‌లో ఇథనాల్ శాతం పెంచడం వల్ల విదేశీ మారకద్రవ్యం మిగులుతుందని, పర్యావరణానికి అనుకూలమని కేంద్రం చేస్తున్న వాదనలు కూడా అర్థరహితమే. ఇథనాల్ తయారీలో 40 శాతం చెరకు, 50 శాతం మొక్కజొన్న, 10 శాతం ఎఫ్‌సిఐ గోడౌన్లలో నిల్వ చేసిన వాటిలో పాడైన ఆహార ధాన్యాలు, పంట వ్యర్థాలు వినియోగిస్తున్నారు.

# మహిళ దారుణ హత్య



జులై 16 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: పటాన్ చెరువు పరిధిలో ఓ మహిళ దారుణ హత్యకు గురైందని పోలీసులు తెలిపారు! అవుటర్ రింగ్ రోడ్ సర్వీస్ రోడ్ వద్ద ఓ మహిళ డెడ్ బాడీ కనిపించిందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని క్లూస్ టీమ్ తో దర్యాప్తు చేస్తున్నారు!మహిళా ఎవరు? డెడ్ బాడీ ఇక్కడికి తెచ్చిపడేశారా? అనే కోణంలో క్లూస్ టీం వివరాలు సేకరిస్తుంది.

## ప్రత్యేక యాత్ర..... ఒక్కరికి రూ.3500!



జూలై 16 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: పటాన్ చెరువు తెలంగాణ రోడ్ ట్రాన్స్పోర్ట్ బిహెచ్ఎల్ డిపో ఆధ్వర్యంలో జులై 31 నుంచి ఆగస్టు 4 వరకు ప్రత్యేక దైవదర్శన భక్తి ప్యాకేజీ యాత్ర గానుగాపూర్,పండరీపూర్, షిరిడి,శని సింగనాపూ 850 ర్, తుల్జాపూర్ క్షేత్రాల దర్శనం కల్పిస్తారు. రూ. 3500 చార్జీలుగా నియమించారు టికెట్లను ఆన్లైన్లో లేదా 8508309052 ను సంప్రదించి బుక్కు చెసుకోవచ్చు అన్నారు.

# పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు - డీఈవో


### కారేపల్లి కేజీబీవీ సందర్శించిన. డీఈవో జి.సదానందం



సింగరేణి జులై 16 నిర్భయవార్త రిపోర్టర్. విద్యార్థులు పట్టుదలతో చదువు మీద శ్రద్ధ పెడితే ఉన్నత స్థాయికి చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి జి.సదానందం అన్నారు. గురువారం కారేపల్లి కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించిన డీఈవో 10వ తరగతి విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు. సూర్యగ్రహణం, చంద్రగ్రహణం వంటి దృగ్విషయాలు ఎలా ఏర్పడతాయి, వంటి ప్రశ్నలతో నిత్య జీవిత సంఘటనల గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని అనవసరమైన అంశాలకు ప్రాధాన్య ఇవ్వ వద్దన్నారు. పాఠశాల దశలోనే భావి భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మధ్యాహ్న భోజన సిబ్బందికి సూచనలు చేశారు. మండల పరిధిలోని ఏకరూప దుస్తుల కుట్టే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. విద్యార్థినులకు వారం రోజులలో డ్రస్ పంపిణీ చేయాలని సూచించారు. డీఈవో వెంట సీఎంవో బాజోజు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు సమీనా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## లక్నవరం చెరువులో గుర్తుతెలియని వృద్ధుడు మృతదేహం

ములుగు జూలై 16 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) గోవిందరావుపేట మండలం లక్నవరం చెరువు లో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన గురువారం కలకలం రేపింది.



స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 60 నుండి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని అంచనా. మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. గుర్తు తెలియని వృద్ధుడి వివరాలు తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని అధికారులు కోరారు.

# మండల రైతుల చిరకాల వాంఛ ప్రగళ్లపల్లి లిఫ్ట్ పనులు చేపట్టే వరకు పోరాటం ఆగదు.దుమ్ముగూడెం బి ఆర్ ఎస్ పార్టీ..

### ఉప ముఖ్యమంత్రితో సహా ముగ్గురు మంత్రులు భద్రాచలం ఎంఎల్ఏ సమాధానం చెప్పాలి...

దుమ్ముగూడెం. జులై 16 నిర్భయ వార్త ప్రతినిధి.సీతారామ ప్రాజెక్టు విషయంలో భద్రాద్రి జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అదేవిధంగా దుమ్ముగూడెం మండల చిరకాల వాంఛ ప్రగళ్లపల్లి లిఫ్ట్ పనులకు నిధులను కేటాయించి పనులు ప్రారంభించాలి అని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రితో సహా ఇద్దరు మంత్రులు సీతారామ ప్రాజెక్టును సందర్శిస్తున్న నేపథ్యంలో జిల్లా భద్రాచలం నియోజకావర్గ రైతాంగానికి స్థానిక ఎం ఎల్ ఏ ఎన్నికల్లో ఇచ్చిన హామీ అయిన ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కు నిధులు కేటాయించి దుమ్ముగూడెం మండలంలో గిరిజన రైతాంగానికి సాగునీళ్లు ఇచ్చేవరకురైతుల పక్షాన నిలబడి ప్రశ్నించాలని దీ=ా పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు గారి



పిలుపు నేపథ్యంలో ఉద్యమానికి సన్నద్ధమవుతున్న బి.ఆర్.ఎస్ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.రైతుల సమస్యలపై ప్రశ్నించినందుకు నిర్బంధ చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని.జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు గోదావరి జలాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా చివరి ఎకరం వరకు నీళ్లు అందించే వరకు మా పోరాటం ఆగదు అందుకే యావత్ భద్రాద్రి జిల్లా రైతుల సమస్యలపై ప్రశ్నిస్తామని, సమాధానాలు రాబడతామని స్పష్టం చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ ప్రజల పక్షాన అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం. ప్రజాక్షేత్రంలో ప్రజల తరఫున పోరాటాలు ఉధృతం చేస్తాం అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో దుమ్ముగూడెం మండల బి ఆర్ ఎస్ పార్టీ ,కన్వీనర్ కణితి రాముడు రేసులక్ష్మి బొల్లి వెంకట్రావు పార్టీ నాయకులు తునికి కామేష్ దామెర్ల శ్రీనివాసరావు లంక శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ మను చౌదరి

శామీర్పేట జూలై 16 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బీఎల్ఓలకు సూచించారు. గురువారం జిల్లాలోని శామీర్పేట గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు కేటాయించిన మొత్తం ఎన్యుమరేషన్ ఫారాల సంఖ్య, ఇప్పటివరకు పంపిణీ చేసిన ఫారాలు, తిరిగి స్వీకరించిన ఫారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్వీకరించిన ఫారాల



డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫారాలు పూరించే సమయంలో ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్పేట తహసీల్దార్ సి. హెచ్. శ్రీనివాస్, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# పోడు భూములకు హక్కు పత్రాలు కల్పించాలి

### ఆదివాసి సంక్షేమ పరిషత్

ములుగు జూలై 16 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆదివాసుల ఆరాధ్య దైవం గోండు బొబ్బిలి కొమరం భీమ్ విగ్రహం దగ్గర అత్యవసర సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో వెంకటాపురం మండల అధ్యక్షులు తురుస కృష్ణ బాబు , మండల ఉపాధ్యాయులు తాటి రాంబాబు మాట్లాడుతూ 5. షెడ్యూల్ ఏజెన్సీ



ప్రాంతంలోని ఆదివాసి గిరిజనులు తమ తరతరాల సాగుభూమి, పోడు భూములపై హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ప్రభుత్వం చట్టాలు చేసినా, అమలులో జరుగుతున్న జాప్యం, అలాగే అటవీ శాఖ అధికారుల ఇబ్బందుల వల్ల ఆదివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యమైన సమస్యలు చాలామంది ఆదివాసులకు ఇప్పటికీ పోడు భూములపై హక్కుల పత్రాలు అందలేదు. అటవీ శాఖ అధికారులు తరచుగా ఆదివాసులను బెదిరించడం, వారి పంటలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. సాగుభూములపై కేసులు చాలామంది ఆదివాసులపై సాగుభూముల సాగు విషయంలో అక్రమ కేసులు నమోదయ్యాయి. సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం పోడు భూములపై హక్కులు లేకపోవడం వల్ల ఆదివాసులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డారు.పోడు భూములపై తక్షణ హక్కుల పత్రాల పంపిణీ అర్హులైన ఆదివాసులందరికీ వెంటనే పోడు భూములపై హక్కుల పత్రాలు పంపిణీ చేయాలి. అటవీ శాఖ అధికారుల వేధింపుల నిలిపివేత ఆదివాసులపై అటవీ శాఖ అధికారుల వేధింపులు వెంటనే నిలిపివేయాలి.అక్రమ కేసుల ఉపసంహరణ ఆదివాసులపై సాగుభూముల సాగు విషయంలో నమోదైన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలనీ ఆదివాసుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి చర్యలు ఆదివాసుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలి. ప్రభుత్వం ఆదివాసుల సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల కమిటీ తరఫున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తురస ప్రశాంత్ , సోడి గోపి తదితరులు పాల్గొన్నారు

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన

### ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

ములుగు జూలై 16 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గురువారం మంగపేట మండలం, నర్సింగ్ సాగర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన మచ్చ లక్ష్మి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి అండగా ఉంటామని, పార్టీ పరంగా అన్ని విధాల ఆదుకుంటామని లక్ష్మణ్ బాబు హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఘనంగా అద్విత గ్రాండ్ హోటల్ ప్రారంభం



ములుగు జూలై 16 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్విత గ్రాండ్ హోటల్ బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, జయ శంకర్ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ములుగు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి-జగదీష్,రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, మాజీ రెడ్కో చైర్మన్, వై సతీష్ రెడ్డి, తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్, ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటల్ యజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో అభివృద్ధి సాధించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఆధునిక సౌకర్యాలతో రూపొందించిన అద్విత గ్రాండ్ హోటల్లో లగ్జరీ రూమ్స్, సెంట్రల్ ఏసీ, లిఫ్ట్ సౌకర్యంతో పాటు కుటుంబాలకు అనువైన ఆహ్లాదకరమైన వసతి కల్పించబడింది. అలాగే ప్రతిరోజూ ఉదయం రుచికరమైన టిఫిన్స్, సౌత్ ఇండియన్ , నార్త్ ఇండియన్ నోరూరించే వంటకాలు, పరిశుభ్రమైన వాతావరణంలో వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని హోటల్ యాజమాన్యం తెలిపింది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు, రమేష్ రెడ్డి, వేణు యాదవ్, సునీల్ కుమార్, మల్లయ్య,నర్సింహా నాయక్, ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, మంచర్ల నాగేష్, నాగేంద్రబాబు , మురళి బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు,, కార్యకర్తలు, హోటల్ యాజమాన్యం, వ్యాపారవేత్తలు పాల్గొని హోటల్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# జూనియర్ కాలేజీలో అవగాహన సదస్సు...

### పర్సనల్ హైజీన్, వ్యసనాలపై విద్యార్థినులకు అవగాహన.



చర్ల, జూలై 16 నిర్భయ వార్త ప్రతినిధి. చర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం విద్యార్థినుల కోసం ఒక ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హోమియోపతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూజ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థినులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ పూజ మాట్లాడుతూ.. ఆడపిల్లలు తమ దైనందిన జీవితంలో వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజిన్) పాటించడం ఎంతో ముఖ్యమని వివరించారు. కౌమార దశకు వచ్చే సమయంలో శరీరంలో జరిగే సహజమైన శారీరక, మానసిక మార్పుల గురించి శాస్త్రీయంగా అవగాహన కల్పించారు. ఈ వయసులో ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవాల్సిన పోషకాహారం, శారీరక మార్పుల పట్ల వహించాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ.. కౌమార దశ మరియు వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించి సమాజంలో ఉన్న రకరకాల అపోహలను తొలగించి వాస్తవాలను వివరించారు. ఆరోగ్యం, పరిశుభ్రత విషయాల్లో నిర్లక్ష్యంగా లేదా అశ్రద్ధగా ఉంటే భవిష్యత్తులో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, ఇన్ఫెక్షన్ల గురించి హెచ్చరించారు.అదేవిధంగా, యవ్వన ప్రాయంలో యువత మత్తు పదార్థాల బారిన ఏ విధంగా పడుతున్నారు, వాటి వల్ల జరిగే నష్టాలు మరియు ఆ వ్యసనాల నుండి ఏ విధంగా బయటపడవచ్చు అనే విషయాలపై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పూర్తి వివరణ ఇచ్చారు. ఈ సమావేశం ద్వారా తమకు ఎన్నో తెలియని విషయాలపై పూర్తి అవగాహన వచ్చిందని, ఇంత మంచి



విషయాలు తెలియజేసినందుకు డాక్టర్ పూజకు విద్యార్థినులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి అవగాహన సదస్సులు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులకు ఎంతో అవసరమని, మూఢనమ్మకాలు మరియు మొహమాటాల వల్ల తమ ఆరోగ్య సమస్యలను బయటకు చెప్పుకోలేని ఎంతోమంది బాలికలకు ఈ ప్రసంగం ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ గోపి, ఆశా కార్యకర్తలు మరియు కాలేజీ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి





ములుగు జూలై 16 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల్లో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తున్నామని, ప్రతి భక్తుడు ఒక మొక్కతో వచ్చి మొక్కు తీర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. గురువారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనుల ప్రతిపాదనలను మ్యాప్ ద్వారా పరిశీలించి, సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క ఆలయ అభివృద్ధి పనులు ఆలయ క్షేత్ర విశిష్టత, చారిత్రక వైభవం, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా చేపట్టాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో కనిపించే నిర్మాణాలకు భిన్నంగా, మల్లూరు దేవస్థాన ప్రత్యేకతను ప్రతిబింబించే విధంగా డిజైన్లు రూపొందించాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. గోదావరి నది, చింతామణి జలధార, కొండలు, గుట్టలు, పురాతన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణలని పేర్కొన్నారు. ఇప్పటికే డబుల్ రోడ్డును అభివృద్ధి చేసినట్లు, రూ. 50 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో ఉన్న ఉపదేవాలయాల అభివృద్ధికి కూడా అంచనాలు సిద్ధం చేసి అందజేయాలని, రాబోయే పుష్కరాల నాటికి వాటి అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చూడాలన్నారు. దేవస్థానం వద్ద నిర్మించిన ఆడిటోరియాన్ని పురావస్తు శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర విశిష్టతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ క్షేత్రాన్ని సందర్శించాలనే ఆసక్తిని ముఖ్యమంత్రి వ్యక్తం చేశారని, భవిష్యత్తులో ముఖ్యమంత్రి పర్యటనలో ఈ దేవస్థానాన్ని సందర్శించే విధంగా చూస్తామన్నారు. మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేయాలన్నారు. రాతి స్వరూపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి విగ్రహం, చుట్టూ ఉన్న కొండలు, గుట్టలు, చింతామణి జలధార వంటి ఈ క్షేత్ర ప్రత్యేకతలను భావితరాలకు అందేలా సంరక్షించాలని అన్నారు. సమ్మక్క--సారలమ్మ వనదేవతల మాదిరిగానే వనంలో, కొండల్లో కొలువైన లక్ష్మీనరసింహస్వామి మహిమను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలోని ప్రతి గోడ, ప్రతి రాతిపై పురాణాల్లోని ఆధ్యాత్మిక విశిష్టతను ప్రతిబింబించే కళాత్మక శిల్పాలు, రూపాలు ఉండేలా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆలయ ఈవోకు సూచించారు. సందర్శించే ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంపై అధికారులు నిరంతరం ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో కొంతసేపు ధ్యానం చేసుకునేలా ఎలాంటి దుర్వాసన, అసౌకర్యం లేకుండా ఆలయ పరిసరాలను నిర్వహించాలని సూచించారు. ఆలయ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొండ ప్రాంతమంతా పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రమనే భావనతో పరిరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ములుగు జిల్లాకు వచ్చే ప్రతి భక్తుడు, ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా ఒక మొక్కతో రావాలని మంత్రి పిలుపునిచ్చారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సమ్మక్క--సారలమ్మ వనదేవతలు, రామప్ప దేవాలయం, బొగత జలపాతం వంటి పర్యాటక, పుణ్యక్షేత్రాలను సందర్శించే ప్రతి ఒక్కరూ తమ మొక్కు తీర్చుకునే సందర్భంగా ఒక మొక్క నాటాలని కోరారు. జామ, మామిడి వంటి పండ్ల మొక్కలను నాటడం ద్వారా అడవుల్లో నివసించే వన్యప్రాణులకు ఆహారం అందడంతో పాటు పచ్చదనం పరిరక్షించబడుతుందని తెలిపారు. అడవుల్లోని దేవస్థానాల పవిత్రతను కాపాడాలంటే అడవులు పరిశుభ్రంగా, పచ్చగా ఉండాలని, స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీటి వనరులను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఒక మొక్కతో ములుగులోకి అడుగుపెట్టండి ఒక మొక్కతో దేవుణ్ణి దర్శించుకోండి  ఒక మొక్కతో మీ కోరికలను కోరుకోండి  అనే సందేశాన్ని ప్రతి భక్తుడు ఆచరణలో పెట్టాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్‌వో వికాస్ మీనా, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జీ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

## యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు



సత్తుపల్లి/ఖమ్మం జూలై 16 నిర్భయవార్త రిపోర్టర్. సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై. ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ. 1,500 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విషయాన్ని అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దాదాపు రూ. 8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా అదనపు ఆయకట్టు తీసుకురాలేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టులో గతంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ ప్రస్తుతం రైతులకు ప్రయోజనం చేకూరేలా దానిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 100 కోట్లతో కొత్తగా రాజీవ్ లింక్ కెనాల్‌ను మంజూరు చేసి రికార్డు సమయంలో పూర్తి చేసి వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరు తరలించేందుకు జూలూరుపాడు టన్నెల్ పనులను మంజూరు చేశామని, మున్నేరు--పాలేరు లింక్ కెనాల్ పనులను కూడా చేపట్టామని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ. 1,000 కోట్ల బిల్లులు విడుదల చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండేందుకే హైదరాబాద్‌లో మాత్రమే సమీక్షలు నిర్వహించకుండా నేరుగా ప్రాజెక్టుల వద్దకే వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఇక్కడే సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ. 135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలను ప్రోత్సహించేలా ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నామని తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి ప్రభుత్వ విధానం ప్రకారం వేగంగా చెల్లింపులు చేయాలని నిర్ణయించామని, జిల్లా కలెక్టర్లు, అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. టీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల శాఖను సర్వనాశనం చేశారని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి గత పాలకుల హయాంలో నిర్వీర్యమైన ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వడం లేదని అనవసరంగా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సీతమ్మ సాగర్, సీతారామ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ నిధులను విడుదల చేయడంతో పాటు ఇప్పటికే చేసిన పనులకు 50 శాతం బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎంను కోరారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఎన్‌జీటీ కేసును పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నేడు సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టీఎంసీల నీటి కేటాయింపులు, టీఏసీ క్లియరెన్స్ తమ ప్రభుత్వమే సాధించిందని తెలిపారు. చట్టపరమైన సమస్యలను పరిష్కరించి సీతమ్మసాగర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని చెప్పారు. నీటిపారుదల ప్రాజెక్టులపై రూ. 1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ 2004లో ప్రారంభించిన దేవాదుల, సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానిని కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. సీతారామ, సీతమ్మసాగర్‌తో పాటు గోదావరిపై పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని తెలిపారు. జూలై నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంతో తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై చర్చలు జరిపి, దివంగత నేత డాక్టర్ వై. ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ బ్యారేజీలు గత ప్రభుత్వ హయాంలోనే కుంగిపోయా యని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వాటిలో నీటిని నిల్వ చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మూడు బ్యారేజీలకు ఒకే విధమైన ఫౌండేషన్ ఉన్నందున నీటిని నిల్వ చేయకుండా పరీక్షలు నిర్వహించి, టెస్ట్ రిపేర్ ఫలితాల ఆధారంగా మరమ్మతులు చేపడుతున్నామని, భారత సైన్యానికి చెందిన అధికారి, నిపుణుల పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులపై కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి కాలేదని, డిండి ప్రాజెక్టు పనులు సగంలోనే నిలిచిపోయా యని, సీతారామ ప్రాజెక్టుపై రూ. 8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు రాలేదన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు. ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వైరా-లంకసాగర్ ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా కరువు కాలంలో కూడా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా నిలిపివేయలేదని స్పష్టం చేసిన మంత్రి, గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో తాత్సారం చేయకుండా వేగంగా పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,  తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి లో మద్యం సిండికేట్ రాజ్యం..!

### ఎమ్మార్పీపై రూ. 20 నుంచి రూ. 50 అదనపు వసూళ్లు..?
### చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ..




సింగరేణి జులై 16 నిర్భయవార్త రిపోర్టర్.  ఖమ్మం జిల్లా, సింగరేణి మండలంలో మద్యం వ్యాపారం పూర్తిగా సిండికేట్ చేతుల్లోకి వెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలు,తండాలు అనే తేడా లేకుండా బెల్ట్ షాపులకు ఎమ్మార్పీ ధర కంటే ఒక్కో మద్యం బాటిల్‌పై రూ. 20 నుంచి రూ. 50 వరకు అదనంగా విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వినియోగదారులపై భారీ భారం పడుతున్నా, ఎక్సైజ్ శాఖ మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో అక్రమ బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నా,వాటిపై దాడులు,తనిఖీలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. "మద్యం సిండికేట్‌కు ఎక్సైజ్ అధికారుల అండదండలున్నాయా?", "మామూళ్ల మత్తులో అధికారులు విధులు మరిచారా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బెల్ట్ షాపుల ద్వారా అధిక ధరలకు మద్యం విక్రయించడం వల్ల సాధారణ ప్రజలు నష్టపోతుండగా,గిరిజన ప్రాంతాల్లో యువత మద్యం వ్యసనానికి బానిసలవుతున్నారని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో బెల్ట్ షాపుల వద్ద మద్యం సేవించడం,గొడవలు,అసాంఘిక కార్యకలాపాలు పెరిగి మహిళలు,విద్యార్థులు,వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

# మాదకదవ్యాలు విక్రయిస్తే జైలుకే - ఎస్సై గోపి




సింగరేణి జులై 16 నిర్భయవార్త రిపోర్టర్. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు నేపథ్యంలో  కారేపల్లిలో ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు.  విద్యార్థులు, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయిని చాక్లెట్లు, సిగరెట్లు, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారనే సమాచారంతో  పోలీసులు ,పాన్ షాపులు,కిరాణా దుకాణాలపై దృష్టి పెట్టారు. మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బైరు గోపి సూచించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే కారేపల్లి పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సూళ్లూరుపేట నారాయణ పాఠశాల విద్యార్థి ఎన్నికలు









సూళ్లూరుపేట అర్బన్ (నిర్భయవార్త ప్రతినిధి ;: ) తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణంలోని నారాయణ పాఠశాలలో ప్రజాస్వామ్య విలువలను చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో పెంపొందించే గొప్ప కార్యక్రమం శ్రీకారం చుట్టారు .టు హక్కు విలువను విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేస్తూ ఎన్నికల నిర్వహణ.నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించిన నారాయణ పాఠశాల.విద్యార్థులు ఉత్సాహంగా ఓటు వేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు.ఎన్నికల ప్రక్రియను నిజమైన పోలింగ్ విధానంలో నిర్వహించి ఆదర్శంగా నిలిచిన నారాయణ పాఠశాల.విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో విజయవంతమైన ఎన్నికలు నిర్వహించి ఆనందం వ్యక్తపరిచారు

# సూళ్లూరుపేట రూరల్ గ్రామాలలో స్వచ్ఛ రథంపై అవగాహన కార్యక్రమాలు

**స్వచ్ఛరథానికి నిల్వ ఉంచిన పొడి చెత్తను అందజేసి ముడి సరుకులు తీసుకోండి**

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై వెంకటేశ్వర రావు**

సూళ్లూరుపేట. (నిర్భయవార్త ప్రతినిధి ;: ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని ముఖ్యం గా పంచాయతీరాజ్ శాఖ నుండి శానిటేషన్ విషయంలో, త్రాగునీరు, వీధి దీపాలు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని సూళ్లూరుపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటే శ్వరరావు తెలిపా రు.శానిటేషన్ విషయంలో అన్ని గ్రామాలలో స్వచ్ఛ రథం కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఇంటి నుండి గ్రీన్ అంబాసిడర్ లు తడి చెత్త పొడి చెత్త సేకరించడం జరుగుతుందని, తడి చెత్తను మాత్రమే సేకరించి పొడి చెత్తను గోనెసంచులో నిల్వ ఉంచినట్లయితే వారానికి ఒక్కసారి వచ్చే స్వచ్ఛరథం సిబ్బందికి పొడి చెత్తను ఇచ్చినట్లయితే ప్రభుత్వం వారు నిర్దేశించిన ప్రకారం ఇంట్లో ఉపయోగపడే 14 రకాల ముడి సరుకులు ఇవ్వబడుతుందని ఎంపీడీవో తెలియజేశారు.ప్రతి గ్రామపంచాయతీలో పనికిరాని ప్రతి వస్తువు నిల్వ ఉంచి గ్రామానికి వచ్చే స్వచ్ఛ రథానికి అందజేసి14 రకాల ముడి సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సూళ్లూరుపేట మండలంలో ఉన్న రూరల్ పంచాయతీలలో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవచ్చని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలియజేశారు.

# సీతారామ ప్రోజక్ట్ నీళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకే ఇవ్వాలి .

**బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్.**

చర్ల జులై 16 నిర్భయ వార్త ప్రతినిధి.సీతారామ ప్రోజెక్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు ఇవ్వాలని టిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు.ఖమ్మం జిల్లా మంత్రులు సీతారామ ప్రోజక్ట్ నీళ్లు ఖమ్మం జిల్లాకు తరలించుటకు ప్రణాళికలు తయారు చేస్తున్నారుఅని అన్నారు. దీనిని అడ్డుకొనుటకు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అశ్వాపురం వస్తున్న 4 గురు మంత్రులు సీతారామ ప్రోజక్ట్ సందర్శించడానికి వస్తున్న సందర్భంగా రైతుల తరుపున నిరసన తెలియజేయుటకు మనుగూరు బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేసి అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హరించి ప్రజాస్వామ్యాని తుంగలో తొక్కుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రశ్నిస్తున్న ప్రజల గొంతు పోలీసుల ద్వారా అణచివేయలని ప్రయత్నం చేస్తుందని, ఈ ప్రభుత్వం ప్రజలకు నష్టం చేసే ఏ కార్యక్రమం చేసిన ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికైన సీతారామ ప్రోజక్ట్ నీళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు మాత్రమే వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు.



# నెల రోజులుగా త్రాగు నీరు కోసం అవస్థలు పడుతున్న నాదెండ్ల వారి కండ్రిగ గ్రామ ప్రజలు

సూళ్లూరుపేట రూరల్( నిర్భయవార్త ప్రతినిధి ;: )తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం నాదెండ్ల వారి కండ్రిగ గ్రామంలో నెలరోజులుగా తీవ్ర తాగునీటి సమస్యతో గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో నీరు అందుబాటులో లేక మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగేళ్ల క్రితం గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారంగా ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించినప్పటికీ, ఇప్పటి వరకు పైప్‌లైన్లు ఏర్పాటు చేయకపోవడంతో ఒక్కరోజు కూడా ట్యాంక్ ద్వారా నీ ట ి





సరఫరా జరగలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ట్యాంక్ ప్రజలకు ఉపయోగపడకుండా నిరుపయోగంగా నిలిచిపోయిందని ఆరోపిస్తున్నారు. గత నెల రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది స్పందించకపోవడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పైప్‌లైన్ పనులు పూర్తి చేసి, ట్యాంక్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామానికి నిరంతర తాగునీటి సరఫరా చేయాలని గ్రామప్రజలు నాయకులను, ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం.

**-- కాకొల్లువారిపల్లెలో రోడ్డు ప్రారంభోత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.**

**-- స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపు.**

నెల్లూరు (నిర్భయవార్త ప్రతినిధి : ):ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి, ఉపాధి అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు భారీ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని నెల్లూరు ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు తెలిపారు. గురువారం వరికుంటపాడు మండలం కాకొల్లువారిపల్లెలో రూ. 1.67 కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవంలో ఎంపీ గారు మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అయితే అభివృద్ధి అంటే కేవలం రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని, విద్య, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో ప్రగతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు.దుత్తలూరు ప్రాంతంలో డిఫెన్స్ అమ్మునిషన్ క్లస్టర్‌లో భాగంగా సుమారు రూ. 2,245 కోట్ల పెట్టుబడులతో ఐదు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందన్నారు. ఏడాదిలోపే పరిశ్రమల నిర్మాణ పనులు ప్రారంభమై స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ఎలాంటి విభేదాలు ఉన్నా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారి దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంతో పాటు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన. ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఢిల్లీ పర్యటనల్లో సైతం రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర మంత్రులతో గంటల తరబడి సమావేశాలు నిర్వహిస్తూ నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని ఎంపీ కొనియాడారు. ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన శ్రీ భాష్యం రామకృష్ణ కి కాకొల్లువారిపల్లెలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజా జీవితంలో మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెలుగు దేశం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





**అమ్మవారి దర్శనం**

నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానాన్ని నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఎంపీ గారికి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

# బాపూజీ కాలనీలో ప్రజల ఫిర్యాదులపై డ్రైనేజ్, త్రాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య



సూళ్లూరుపేట అర్బన్( నిర్భయవార్త ప్రతినిధి,: ) తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణంలో బాపూజి కాలనీ ప్రజల ఫిర్యాదుపై వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఈరోజు ఉదయం 6 గంటలకే కాలనీని సందర్శించి సమస్యలను పరిశీలించారు. డ్రైనేజ్, తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను ప్రజలతో నేరుగా మా ట్లా డి తెలుసుకుని త్వర లోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.గతంలో ఏ కమిషనర్ కూడా కాలనీకి రాలేదని, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్న కమిషనర్ చిన్నయ్య సేవాభావాన్ని కాలనీవాసులు అభినందించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతున్న కమిషనర్ చిన్నయ్య పనితీరు ప్రశంసనీయమని స్థానికులు కొనియాడారు.



# సీనియర్ రాజకీయ నేత గంగపట్నం చంద్రశేఖరయ్యకు నివాళి

**బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**




నెల్లూరు (నిర్భయవార్త ప్రతినిధి : ):సంగం మండలం జంగాలకండ్రిగకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ గంగపట్నం చంద్రశేఖరయ్య పెద్దకర్మ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖరయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. చంద్రశేఖరయ్య మరణం పార్టీకి, ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# కాంగ్రెస్ పార్టీలో అండగుండల గోపికి జిల్లా సెక్రటరీ పదవి



సూళ్లూరుపేట. (నిర్భయవార్త ప్రతినిధి :)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురువం బాబు,అండగుండల గోపిని తిరుపతి జిల్లా (డిస్ట్రిక్ట్ )సెక్రటరీగా నియమించారు. ఈ నియామకంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అండగుండల గోపి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా (డిస్ట్రిక్ట్) సెక్రటరీగా అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డికి, అలాగే తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురువం బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ అభివృద్ధి, యువతను కాంగ్రెస్ పార్టీలోకి ఆకర్షించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తానని గోపి వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగుండల గోపికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో తిరుపతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ని పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



అమరావతి (నిర్భయవార్త ప్రతినిధి ;: ):కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ని ఆంధ్రప్రదేశ్ గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పరామర్శించారు. గవర్నర్ గురువారం ఉదయం హైదరాబాద్ లోని పవన్ కళ్యాణ్ నివాసానికి విచ్చేశారు. ఆయనతో మాట్లాడి శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలని చెప్పారు. త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు.పవన్ కళ్యాణ్ లైబ్రరీ తిలకించిన జస్టిస్ అబ్దుల్ నజీర్పవన్ కళ్యాణ్ స్వగృహంలో ఉన్న లైబ్రరీని గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తిలకించారు. లైబ్రరీలోని పలు పుస్తకాలను పరిశీలించారు. ప్రఖ్యాత రచయితలు, స్కాలర్స్, విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ మేకర్స్ రాసిన పుస్తకాలు పరిశీలించారు. వాటి గురించి శ్రీ పవన్ కళ్యాణ్ తో ఆసక్తిగా చర్చించారు. శ్రీ పవన్ కళ్యాణ్ కోరడంతో ఓ పుస్తకంపై జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆటోగ్రాఫ్ చేశారు.గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఎంతో ఆప్యాయతతో వచ్చి పరామర్శించినందుకు శ్రీ పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 35 దాటాక గర్భధారణ గురించి...

ఇప్పటి జీవనశైలిలో మహిళలు చదువు, ఉద్యోగం, ఆర్థిక స్థిరత్వం, వ్యక్తిగత లక్ష్యాలకు ప్రాధాన్యం ఇస్తూ కొంత ఆలస్యంగా తల్లులు కావాలని నిర్ణయించుకుంటున్నారు. అందుకే 35 ఏళ్ల తర్వాత గర్భం దాల్చడం ఇప్పుడు సాధారణ విషయంగా మారుతోంది. వైద్య రంగంలో వచ్చిన పురోగతి వల్ల ఈ వయసులోనూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వడం సాధ్యమే! అయితే ఈ దశలో గర్భధారణను కొంత ఎక్కువ జాగ్రత్తగా ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వయసు పెరిగే కొద్దీ అండాల సంఖ్య, వాటి నాణ్యత క్రమంగా తగ్గుతాయి. ప్రతి నెల గర్భం దాల్చే అవకాశం కూడా తగ్గుతుంది. గర్భస్రావం, గర్భధారణ సమయంలో మధుమేహం, అధిక రక్తపోటు, నెలలు నిండకముందే ప్రసవం, శిశువులో కొన్ని జన్యుపరమైన లోపాలు వచ్చే అవకాశాలు కొంత పెరుగుతాయి. అందుకే గర్భం కోసం ప్రయత్నించే ముందు కొన్ని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ పరీక్షలు భయపెట్టడానికి కాదు... గర్భధారణను మరింత సురక్షితంగా మార్చడానికి.





### ముందస్తు పరీక్షలు

గర్భధారణకు ముందు వైద్యులు మొదట అండాశయాల పనితీరును పరిశీలిస్తారు. కొన్ని రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ ద్వారా అండాల నిల్వ గురించి అంచనా వేస్తారు. దీంతో గర్భం కోసం ఎంతకాలం వేచి చూడవచ్చు, చికిత్స అవసరమా అనే విషయాలపై స్పష్టత వస్తుంది. అదే సమయంలో థైరాయిడ్ పరీక్ష కూడా చాలా ముఖ్యం. థైరాయిడ్ సమస్య ఉంటే అండోత్సర్గం సక్రమంగా జరగకపోవచ్చు. గర్భం రావడంలో ఆలస్యం కావచ్చు. చికిత్స లేకపోతే గర్భస్రావం ప్రమాదం కూడా పెరుగుతుంది.

రక్తంలో చక్కెర, రక్తపోటు పరీక్షలు కూడా తప్పనిసరి. ముందుగానే మధుమేహం లేదా అధిక రక్తపోటును గుర్తించి నియంత్రిస్తే గర్భధారణ సమయంలో వచ్చే అనేక సమస్యలను నివారించవచ్చు. అలాగే హిమోగ్లోబిన్, ఇనుము నిల్వలు, విటమిన్ డి, విటమిన్ బి–12 వంటి పోషకాల స్థాయిలను కూడా పరీక్షిస్తారు. వీటి లోపం ఉంటే రక్తహీనత, అలసట, గర్భంలోని శిశువు ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే అవసరమైతే ముందుగానే పోషకాహార సప్లిమెంట్లు సూచిస్తారు. ముఖ్యంగా గర్భం కోసం ప్రయత్నించే ప్రతి మహిళ రోజుకు 400 మైక్రోగ్రాముల ఫోలిక్ యాసిడ్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శిశువులో మెదడు, వెన్నెముక అభివృద్ధికి సంబంధించిన లోపాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

### ఆరోగ్యమే భరోసా

గర్భాశయం, అండాశయాల్లో ఫైబ్రాయిడ్లు, తిత్తులు, ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యలు ఉన్నాయా అని అల్ట్రాసౌండ్ ద్వారా పరిశీలిస్తారు. ఇవి గర్భం రావడాన్ని లేదా గర్భం నిలవడాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. అలాగే రుబెల్లా, చికెన్‌పాక్స్ వంటి వ్యాధులపై రోగనిరోధక శక్తి ఉందా అని కూడా పరీక్షిస్తారు.

అవసరమైతే ముందుగానే టీకాలు వేయించుకోవచ్చు. హెచ్ఐవీ, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, సిఫిలిస్ వంటి అంటువ్యాధుల పరీక్షలు కూడా అవసరాన్ని బట్టి చేస్తారు. ఇవన్నీ తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్య రక్షణ కోసమే.

35 ఏళ్లు దాటాక గర్భం దాల్చడం ప్రమాదకరమని అనుకోవడం సరైంది కాదు. అయితే ముందస్తు ప్రణాళిక మాత్రం ఎంతో ముఖ్యం. గైనకాలజిస్టును సంప్రదించి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయించుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, బరువును అదుపులో ఉంచుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ధూమపానం, మద్యానికి దూరంగా ఉండడం వంటి అలవాట్లు ఆరోగ్యకరమైన గర్భధారణకు బలమైన పునాది వేస్తాయి. తల్లిగా మారే అందమైన ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, ఆనందంగా మార్చేది ముందస్తు జాగ్రత్తలేనని వైద్యులు గుర్తుచేస్తున్నారు.

# ఆదాయం... ఖర్చు... పొదుపు



ఒకప్పుడు ఉద్యోగులు జీతం అందగానే కొంత మొత్తాన్ని పొదుపు చేసేవారు. అదే డబ్బు అత్యవసర సమయాల్లో అండగా నిలిచేది. ఇప్పుడు ఆదాయం పెరిగినా ఖర్చులు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. నెల జీతంలో పెద్ద భాగం గృహ రుణాలు, పిల్లల చదువు, వైద్య ఖర్చులు, ఇతర నిత్యావసరాలకే వెచ్చించాల్సి వస్తోంది. దీంతో మంచి ఆదాయం ఉన్న కుటుంబాలు కూడా నెలాఖరుకు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

### ఖర్చుకు ప్రణాళిక ఉండాలి

కుటుంబ ఆర్థిక నిర్వహణలో ప్రణాళిక కీలకం. ఇందుకోసం 50/30/20 సూత్రాన్ని పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. జీతంలో 50 శాతం నిత్యావసరాలకు, 30 శాతం వ్యక్తిగత అవసరాలకు, 20 శాతం పొదుపుకు కేటాయించాలి. అలాగే ఈఎంఐలు మొత్తం ఆదాయంలో 40 శాతానికి మించకుండా చూసుకోవాలి. ఏదైనా వస్తువు కొనుగోలు చేసే ముందు అది నిజంగా అవసరమా కాదా అని ఆలోచించాలి. కొనుగోలు చేయాల్సిన వస్తువుల జాబితాను ముందుగానే సిద్ధం చేసుకుంటే అనవసర ఖర్చులను తగ్గించవచ్చు. కుటుంబంలోని ప్రతి ప్రధాన ఖర్చుపై భార్యాభర్తలు పరస్పరం చర్చించి నిర్ణయం తీసుకుంటే బడ్జెట్‌ను సమర్థంగా నిర్వహించడంతో పాటు అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం సులభమవుతుంది.

### పొదుపే భరోసా

లైఫ్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా వంటి రక్షణ పథకాలతో పాటు అత్యవసర అవసరాల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకోవడం అవసరం. చిన్న మొత్తంతో ప్రారంభించినా క్రమం తప్పకుండా పొదుపు చేయడం భవిష్యత్తులో ఆర్థిక భద్రతను కల్పిస్తుంది. రెండు దశాబ్దాల క్రితం పెట్టుబడులంటే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పీపీఎఫ్, ఈపీఎఫ్, జీవిత బీమా పాలసీలే ప్రధాన మార్గాలు. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్లు, ఈటీఎఫ్‌లు, ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్లు, రియల్ ఎస్టేట్, డిజిటల్ బంగారం వంటి అనేక పెట్టుబడి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అయితే పూర్తి అవగాహనతోనే పెట్టుబడులు పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. సోషల్ మీడియా ఫైనాన్స్ ఇన్‌ఫ్లుయెన్సర్ల సలహాలను గుడ్డిగా అనుసరించకుండా, తమ ఆదాయం, అవసరాలు, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని చెబుతున్నారు.

ముఖ్యంగా ఐటీ వంటి రంగాల్లో పనిచేసే ఉద్యోగులు ఉద్యోగ విపణిలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ముందుగానే ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవడం, స్థిరమైన ఆస్తులు, దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారించడం అవసరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# అన్నం మంచిదా? రోటీ మంచిదా?

అన్నం మంచిదా? రోటీ మంచిదా? అనే చర్చ ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటుంది. కొందరు బరువు తగ్గాలంటే అన్నం పూర్తిగా మానేయాలని భావిస్తే, మరికొందరు రోటీనే ఆరోగ్యకరమైన ఎంపిక అంటుంటారు. అయితే జీర్ణక్రియ, శరీర అవసరాలు, తీసుకునే పరిమాణం, భోజనంలో ఉండే ఇతర పదార్థాలపై ఆధారపడి రెండింటికీ ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియ పరంగా చూస్తే తెల్ల బియ్యంలో ఉండే పైపొర తొలగిపోవడం వల్ల ఇందులో ఫైబర్ తక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది త్వరగా జీర్ణమై పొట్టపై తక్కువ ఒత్తిడి కలిగిస్తుంది. అసిడిటీ, కడుపు ఉబ్బరం లేదా బలహీనమైన జీర్ణక్రియ ఉన్నవారికి అన్నం తేలికగా జీర్ణమయ్యే ఆహారంగా ఉపయోగపడుతుంది. మరోవైపు రోటీ సంపూర్ణ గోధుమ పిండితో తయారవుతుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది. ఇది పేగుల ఆరోగ్యానికి, మలబద్ధకం నివారణకు సహాయపడుతుంది. ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించినప్పటికీ, కొంతమందికి ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి రోటీ కొంత భారంగా అనిపిస్తుంది.



**షుగర్ లెవల్స్ పెరుగుతాయా..**

అన్నం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయని చాలామంది భావిస్తుంటారు. అయితే పరిశోధనల ప్రకారం, పరిమిత మోతాదులో తీసుకుంటే తెల్ల బియ్యం, గోధుమ రోటీల గ్లైసెమిక్ ఇండెక్స్‌లో పెద్దగా తేడా ఉండదు. రక్తంలో చక్కెరపై ప్రభావం చూపేది కేవలం అన్నం లేదా రోటీ మాత్రమే కాదు. ఎంత పరిమాణంలో తింటున్నాం, వాటితోపాటు కూరగాయలు, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు తీసుకుంటున్నామా లేదా, వంట విధానం ఎలా ఉందనే అంశాలు కూడా కీలకంగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునేవారు అన్నాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. బరువు పెరగడానికి లేదా తగ్గడానికి ప్రధాన కారణం మొత్తం కేలరీల వినియోగం, ఆహారపు అలవాట్లు, పరిమాణ నియంత్రణ. రోటీలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండి మధ్యలో చిరుతిండ్లు తినే అలవాటు తగ్గుతుంది. అదే సమయంలో కొంతమందికి అన్నం సులభంగా జీర్ణమై తేలికగా అనిపించడం వల్ల కూడా అవసరానికి మించి తినకుండా ఉండే అవకాశం ఉంటుంది. అయితే కూరగాయలు, ప్రోటీన్ లేకుండా అన్నం లేదా రోటీని ఎక్కువ మోతాదులో తీసుకుంటే బరువు తగ్గే ప్రక్రియ నెమ్మదించే అవకాశం ఉంటుంది.

**ఈ సమస్యలు ఉన్నవారికి అన్నం మంచిది..**

కొన్ని ఆరోగ్య పరిస్థితుల్లో అన్నం మంచి ఎంపిక అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఐబీఎస్ (ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్), పీసీఓఎస్, కడుపు ఉబ్బరం లేదా గ్లూటెన్‌కు సున్నితత్వం ఉన్నవారికి అన్నం తేలికగా జీర్ణమయ్యే అవకాశం ఉంటుంది. అన్నంతోపాటు పప్పు, పెరుగు, కూరగాయలు, ప్రోటీన్ పదార్థాలు కలిపి తీసుకుంటే సమతుల్య ఆహారంగా మారుతుంది. అలాగే ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా చేర్చడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండేందుకు సహాయపడుతుంది. మరోవైపు జీర్ణక్రియ బాగా ఉండే వారు, ఎక్కువ ఫైబర్ అవసరమైన వారు లేదా ఎక్కువసేపు శక్తిని నిల్వ ఉంచుకోవాలనుకునేవారికి రోటీ అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారికి ఉదయం లేదా మధ్యాహ్నం భోజనంలో రోటీ తీసుకోవడం ఎక్కువసేపు తృప్తిగా ఉండేందుకు సహాయపడుతుంది. **ఏది ఉత్తమం..**

అన్నం అయినా, రోటీ అయినా ఆరోగ్యానికి మేలు చేయాలంటే కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పరిమిత మోతాదులో తీసుకోవడం, కూరగాయలు, పప్పులు లేదా ఇతర ప్రోటీన్ ఆహారాలతో కలిపి తినడం, రాత్రి చాలా ఆలస్యంగా భోజనం చేయకుండా ఉండటం, ఆహారాన్ని బాగా నమిలి నెమ్మదిగా తినడం వంటి అలవాట్లు జీర్ణక్రియకు, బరువు నియంత్రణకు ఉపయోగపడతాయి. అంతిమంగా చూస్తే అన్నం లేదా రోటీ రెండింటిలో ఏదీ పూర్తిగా ఉత్తమం లేదా పూర్తిగా హానికరం కాదు. జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి అన్నం కొంత అనుకూలంగా ఉంటుంది. ఎక్కువ ఫైబర్, ఎక్కువసేపు ఆకలి నియంత్రణ కోరుకునేవారికి రోటీ మంచి ఎంపిక అవుతుంది. కాబట్టి శరీర అవసరాలు, ఆరోగ్య పరిస్థితులు, తీసుకునే పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకుని సమతుల్య ఆహారం తీసుకోవడమే ఆరోగ్యకరమైన మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

# పేపర్ బ్యాగ్ ఎందుకు?



మన ఇంట్లో మామిడి, అరటిపండు వంటివి సరిగా పండకపోతే పేపర్ బ్యాగ్‌లో పెట్టడం చూస్తున్నాం. కానీ, ఎప్పుడైనా అది ఎలా సాధ్యమవుతుందో గమనించారా? మనలో చాలామంది గొప్ప చెఫ్స్, సెలెబ్రిటీలు చెప్పిన చిట్కాలు చదవడానికి ఆసక్తి చూపిస్తున్నాం. కానీ, ఒక్కసారి మన ఇంట్లో మన నానమ్మ, అమ్మ చేసే ఈ చిన్ని మ్యాజిక్‌ను గమనిం చారా? కొన్ని దశాబ్దల నుంచి ఇలా చేస్తూ వస్తున్నారు. కాలక్రమేణ 'ఎలా.. ఎందుకు' అనే ప్రశ్నలు అడగకపోవడం వల్ల మర్చిపోయిన ఈ మ్యాజిక్ వెనుక రహస్యాన్ని తెలుసుకుందాం.పండ్లలో రెండు రకాలుౖక్లైమెటిక్, నాన్‌క్లైమెటిక్ అని ఉంటాయి. ఎథిలీన్ విడుదల చేసేవి.. విడుదల చేయనివి. ఎథిలీన్ విడుదల చేసే పండ్లుక్లైమెటిక్ కోవకు చెందినవి. ఇవి పండటానికి చెట్టుకే ఉండనవసరం లేదు. చెట్టు నుంచి కోసిన తరువాత కూడా ఇలా పేపర్ బ్యాగ్‌లో ఉంచితే గ్యాస్ విడుదల చేసి పండుతాయి. కానీ, పుచ్చకాయ, నిమ్మ, చెర్రీ, దోసకాయ వంటి నాన్‌క్లైమెటిక్ పండ్లు, కూరగాయలు కోసిన తర్వాత పక్వానికి రావు. ఎథిలీన్‌ను విడుదల చేయవు కాబట్టి, వీటిపై ఈ చిట్కా పనిచేయదు. అవి పండాలంటే కచ్చితంగా చెట్టుకే ఉండాలి. లేకపోతే తగిన రుచి, పక్వం, తీపిని సమకూర్చుకోలేవు.

**ప్లాస్టిక్ బ్యాగ్‌లో పెడితే..?**

పేపర్ బ్యాగ్‌లోనే ఎందుకంటే ఆపిల్, మామిడి, కివీ, పీచ్, అవకాడో వంటి పండ్లు పక్వం చెందే సమయంలో 'ఎథిలీన్' అనే సహజ వాయువును విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియలో కార్బన్ డయాక్సైడ్, ఆక్సిజన్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. కార్బన్ డయాక్సైడ్‌ను బంధించకుండా దానికి తగిన తోవను చూపడంలోనూ, ఆక్సిజన్ లోపలికి వచ్చే వెసులుబాటును పేపర్ బ్యాగ్ కల్పిస్తుంది. ఈ పండ్లను ప్లాస్టిక్ కవర్‌లో ఉంచితే కార్బన్ డయాక్సైడ్ బయటికి వెళ్లే అవకాశం లేక, ఆక్సిజన్ లోనికి వచ్చే మార్గం లేక.. పండ్లు కుళ్లిపోతాయి.

# సినిమా సిత్రం

## 2026లో కంబ్యాక్ ఇచ్చిన హీరోలు!



బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాసి తమ స్టార్ పవర్‌ను మరోసారి నిరూపించుకుని అభిమానులకు పండగ వాతావరణాన్ని అందించారు. 2026వ సంవత్సరం కొంతమంది స్టార్లకు ప్రత్యేకంగా గుర్తిండి పోయే ఏడాది కానుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కొంతకాలంగా వరుస పరాజయాలతో ఇబ్బందులు పడ్డ కొంత మంది అగ్రనటులు ఈ ఏడాది అద్భుతమైన కంబ్యాక్ ఇచ్చారు. బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాసి తమ స్టార్ పవర్‌ను మరోసారి నిరూపించుకుని అభిమానులకు పండగ వాతావరణాన్ని అందించారు. మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో ఈ ఏడాది ప్రత్యేకమైన మలుపుగా మారింది. 'భోళా శంకర్' ఫ్లాప్ తర్వాత కొంతకాలం విరామం తీసుకున్నప్పటికీ 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో అదిరిపోయే కంబ్యాక్ ఇచ్చారు.స్టార్ హీరో కోరికపై నెటిజనుల చర్చ! అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇండస్ట్రీ హిట్ కావడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల వసూళ్లను సాధించి చిరంజీవి సత్తాను చాటి చెప్పింది. దీంతో సీనియర్ స్టార్స్ లో మెగాస్టార్ నెంబర్ వన్ గా నిలిచారు. ఇప్పుడా రికార్డులు చిరంజీవి సమకాలీకుల్లో ఎవరు బ్రేక్ చేస్తారు? అన్నది ఆసక్తికరం. రామ్ చరణ్ విషయానికి వస్తే ఆయన కెరీర్‌లో 'పెద్ది' చిత్రం మైలురాయిగా నిలిచింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో చరణ్ చేసిన ఈ ప్రయోగం ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందనను పొందింది. ఈ సినిమా దక్షిణాదిన అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచి.. చరణ్‌ను బాక్సాఫీస్ ఛాంపియన్‌గా నిలబెట్టింది. కఠినమైన శిక్షణతో చరణ్ పోషించిన పాత్ర అభిమానులను అమితంగా అలరించింది. 'గేమ్ ఛేంజర్' తర్వాత చరణ్ ఖాతాలో పడిన హిట్ చిత్రమిది. యువ హీరోల విషయానికి వస్తే అఖిల్ అక్కినేని ఈ ఏడాది 'లెనిన్' చిత్రంతో భారీ కమర్షియల్ సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా బ్రేక్ ఈవెన్ సాధించడంతో అఖిల్ కెరీర్‌లో కీలక విజయంగా మారింది. కథా ఎంపికలో అఖిల్ జాగ్రత్తలు ఈ చిత్రంతో పండాయని విశ్లేషకులు భావిస్తున్నారు. 'ఏజెంట్' ఫ్లాప్ తర్వాత అఖల్ కి దక్కిన విజయమిది.

## చరణ్ 'పెద్ది'.. మేకర్స్ నిర్ణయం కలిసొచ్చినట్లుందే..



ముఖ్యంగా ఓటీటీ కోసం కొన్ని కొత్త సీన్స్ యాడ్ చేయాలన్న మేకర్స్ నిర్ణయం సినిమాకు అట్రాక్షన్ గా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న సినిమాలు ఓటీటీలో కూడా అదే రేంజ్ రెస్పాన్స్ ను అందుకోవడం రేర్. అయితే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన పెద్ది విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. థియేట్రికల్ రన్ ముగిసిన తర్వాత నెట్ ఫ్లిక్స్ లోకి వచ్చిన ఆ సినిమా, అక్కడ కూడా మంచి వ్యూయర్ షిప్ తో దూసుకెళ్తోంది. ముఖ్యంగా ఓటీటీ కోసం కొన్ని కొత్త సీన్స్ యాడ్ చేయాలన్న మేకర్స్ నిర్ణయం సినిమాకు అట్రాక్షన్ గా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్టార్ హీరో కోరికపై నెటిజనుల చర్చ! బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన ఆ స్పోర్ట్స్ యాక్షన్

ఎంటర్టైనర్ థియేటర్లలో ఇప్పటికే భారీ వసూళ్లు సాధించి విజయాన్ని నమోదు చేసింది. ఆ సక్సెస్ కు కొనసాగింపుగా జూలై 9 నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ ప్రారంభమైన తర్వాత కూడా సినిమాకు మంచి రెస్పాన్స్ లభిస్తోంది. థియేటర్లలో చూసిన ప్రేక్షకులే మరోసారి ఓటీటీలో సినిమా చూడటం విశేషంగా మారింది. దీనికి ప్రధాన కారణంగా ఓటీటీ వెర్షన్ లో యాడ్ చేసిన ఎక్స్ ట్రా సీన్స్ అని తెలుస్తోంది. థియేటర్లలో లేని కొన్ని ఎమోషనల్, డ్రామాటిక్ మూమెంట్స్ ను ఓటీటీ కట్ లో చేర్చడంతో ఇప్పటికే సినిమా చూసిన వారిలో కూడా మళ్లీ ఆసక్తి పెరిగింది. అదే సమయంలో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు కూడా ఇప్పుడు ఆ సినిమాను పెద్ద ఎత్తున చూస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా పెద్దిపై పాజిటివ్ రెస్పాన్స్ కనిపిస్తోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలపై మళ్లీ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కథను దర్శకుడు మలిచిన తీరు, ఓటీటీ వెర్షన్ లో కనిపించిన కొత్త సీన్స్ సినిమాపై చర్చను మరింత పెంచాయి.

డిజిటల్ ప్లాట్ ఫామ్ లో తొలి వారంలోనే పెద్దికి సుమారు 1.9 మిలియన్ వ్యూస్ వచ్చినట్లు సమాచారం. అదే సమయంలో భారత్ లో నెట్ ఫ్లిక్స్ ట్రెండింగ్ జాబితాలో టాప్ 10లో ఉండడం విశేషం.

మరో ఆసక్తికర అంశం ఏమిటంటే..

ప్రస్తుతం పెద్ది మూవీ సౌత్ లాంగ్వేజ్ లో మాత్రమే అందుబాటులో ఉండగా, హిందీ వెర్షన్ విడుదల కావాల్సి ఉంది. హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ ప్రారంభమైన తర్వాత వ్యూయర్ షిప్ మరింత పెరిగే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి. సినిమా థియేటర్లలో విజయవంతమైతే ఓటీటీలో కూడా అదే కట్ విడుదల చేయడం కామన్. కానీ పెద్ది విషయంలో మాత్రం ప్రేక్షకులకు కొత్త ఎక్స్పీరియన్స్ కలిగించేలా కొత్త సీన్స్ యాడ్ చేయడం మేకర్స్ తీసుకున్న తెలివైన నిర్ణయంగా కనిపిస్తోంది.

అదే ఇప్పుడు మరోసారి సినిమాపై ఆసక్తిని పెంచి, డిజిటల్ ప్లాట్ ఫామ్ పై కూడా మంచి రిజల్ట్ తీసుకొస్తోంది. ఇప్పటికే థియేటర్లలో సత్తా చాటిన పెద్ది.. ఇప్పుడు ఓటీటీలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. రానున్న వారాల్లో ఆ సినిమా వ్యూయర్ షిప్ మరింత పెరిగి కొత్త రికార్డులు సృష్టిస్తుందా? లేదా అనే ఆసక్తి సినీ ప్రియుల్లో నెలకొంది.

ప్రస్తుతం ట్రెండ్ చూస్తే.. మేకర్స్ తీసుకున్న చిన్న నిర్ణయం సినిమాకు మరో విజయాన్ని అందించినట్లే కనిపిస్తోంది.

## ఓటీటీ ఎఫెక్ట్ ఉన్నా.. దిల్ రాజు ధైర్యమేంటి?

ఒకప్పుడు భారీ సినిమాల థియేట్రికల్ హక్కుల కోసం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు పోటీ పడేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ఓటీటీలు వచ్చాక ప్రేక్షకుల అలవాట్లు మారాయి. ఒకప్పుడు భారీ సినిమాల థియేట్రికల్ హక్కుల కోసం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు పోటీ పడేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ఓటీటీలు వచ్చాక ప్రేక్షకుల అలవాట్లు మారాయి. చిన్న సినిమాలే కాదు, కొన్ని పెద్ద చిత్రాలు విడుదలైన కొద్ది వారాల్లోనే ఓటీటీల్లోకి వచ్చేస్తున్నాయి. అలాంటి సమయంలో వంద కోట్లకు పైగా



పెట్టుబడులతో థియేట్రికల్ హక్కుల కోసం ముందుకు రావడం చాలా మందికి ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే ఆ విషయంలో దిల్ రాజు మాత్రం ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు.స్టార్ హీరో కోరికపై నెటిజనుల చర్చ! టాలీవుడ్ లో నిర్మాతగా ఎంత పేరు సంపాదించారో, అంతకంటే ముందే ఆయన డిస్ట్రిబ్యూటర్ గా తన ముద్ర వేశారు. దాదాపు మూడు దశాబ్దాలుగా మార్కెట్ ను దగ్గరగా గమనిస్తున్న ఆయనకు ప్రేక్షకుల టేస్ట్, ప్రాంతాల వారీగా సినిమా బిజినెస్ ఎలా జరుగుతుందో స్పష్టమైన అవగాహన ఉంది. అందుకే చాలా మంది రిస్క్ గా భావించే డీల్స్ ను కూడా ఆయన ధైర్యంగా చేస్తుంటారు. ఓటీటీల ఎఫెక్ట్ వల్ల మిడ్ రేంజ్ సినిమాల థియేట్రికల్ మార్కెట్ కొంత దెబ్బతిన్నా, భారీ ఈవెంట్ సినిమాల పరిస్థితి మాత్రం వేరుగా ఉందని టాక్ వినిపిస్తోంది. స్టార్ హీరోలు, భారీ బడ్జెట్, పాన్ ఇండియా స్థాయి హైప్ ఉన్న చిత్రాలు ఇప్పటికీ థియేటర్లకు ప్రేక్షకులను రప్పిస్తున్నాయి. ఆ విషయాన్ని దిల్ రాజు ముందుగానే గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే పెద్ద సినిమాల విషయంలో ఆయన పెట్టుబడులు తగ్గించడం లేదు. దిల్ రాజు కేవలం సినిమా పేరును చూసి నిర్ణయం తీసుకునే వ్యక్తి కాదు. హీరో మార్కెట్, దర్శకుడి ట్రాక్ రికార్డు, రిలీజ్ టైమింగ్, పోటీ పరిస్థితులు, ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలు.. ఇలా అనేక అంశాలను లెక్కలోకి తీసుకున్న తర్వాతే డీల్ క్లోజ్ చేస్తారని అంతా చెబుతుంటారు. అందుకే భారీ మొత్తాలు కనిపించినా, వాటి వెనుక ఆయనకు కనిపించే లెక్కలు వేరుగా ఉంటాయని అంటున్నారు. మరో ముఖ్యమైన అంశం ఆయనకు ఉన్న నెట్ వర్క్. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో దశాబ్దాలుగా నిర్మించుకున్న వ్యవస్థ వల్ల థియేట్రికల్ బిజినెస్ పై ఆయనకు పట్టు ఉంది. ఏ సినిమా ఎక్కడ ఎంత వరకు పనిచేస్తుందనే అంచనాలను ఇతరుల కంటే మెరుగ్గా వేయగలరనే పేరు కూడా ఉంది. అదే ఆయన ధైర్యానికి ప్రధాన కారణంట. నిజానికి ఓటీటీల యుగంలో చాలా మంది రిస్క్ తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ దిల్ రాజు మాత్రం ఇంకా థియేటర్ల మాయ తగ్గలేదని నమ్ముతున్నట్లు కనిపిస్తున్నారు. ప్రేక్షకులు ఇంట్లో కంటెంట్ చూస్తున్నా, భారీ సినిమాలను మాత్రం స్క్రీన్ పై చూడాలనే ఆసక్తి ఇప్పటికీ ఉందనే విశ్వాసంతో ముందుకు వెళ్తున్నట్లు ఉన్నారు. అందుకే ఇప్పుడు ఆసక్తికర చర్చ సాగుతోంది.

## అఖిల్ 2.0.. 'లెనిన్' సక్సెస్ ని తలకెక్కించుకోని అయ్యగారు.. ఇది క్లారిటీ అంటే




కాలం ఎప్పుడు ఒకేలా ఉండదు. అలానే కాలానుగుణంగా అది నేర్పే పాఠాలు, మార్చే పరిస్థితులు రీత్యా ప్రతీ ఒక్కరిలో కూడా ఏదొక మార్పు వస్తుంది. అలానే ఇప్పుడు టాలీవుడ్ యంగ్ హీరో అఖిల్ అక్కినేని ఒకప్పటిలా కాకుండా ఇప్పుడు ఎంతో క్లియర్ గా కనిపిస్తున్నాడు అని చెప్పడంలో సందేహం లేదు.ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సక్సెస్ ని లెనిన్ రూపంలో ఇప్పుడు కొట్టాడు. సరే హిట్ కొట్టేసా కదా అని ఆ సక్సెస్ ని ఏమాత్రం తను తలకి ఎక్కించుకునే ప్రయత్నం చేయకపోవడం అనేది చాలా మంచి విషయం.

పైపెచ్చు ఇంకా జాగ్రత్తగా ఉంటాను అని అభిమానులకి ప్రామిస్ చేసి అఖిల్ తన పరిపక్వతను చాటుకొని కెరీర్ లో కొత్త జర్నీ కోసం సిద్ధం అవుతున్నట్టు తెలిపాడు.తన

నుంచి తరహా టర్న్ అనేది చాలామంది ఊహించి ఉండకపోవచ్చు. కానీ అఖిల్ చూపించిన ఈ పరిపక్వత మాత్రం ఫ్యూచర్ లో తనకి మరింత మంచి పేరు తెచ్చి పెట్టడం ఖాయం. సో లెనిన్ తర్వాత అఖిల్ అడుగులు ఎలా ఉంటాయో చూడాల్సిందే

## శ్రీలలకు మరో షాక్.. ఆ సినిమా ఛాన్స్ మిస్..?

టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల కెరీర్ ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన మలుపు తిరిగింది. ఒకప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ బ్యూటీ, ప్రస్తుతం చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఆమె మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కోల్పోయినట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ సరసన నటించే అవకాశాన్ని శ్రీలీల త్రుటిలో మిస్ చేసుకుందని, ఆమె స్థానంలో కయాదు లోహర్‌ను ఎంపిక చేశారని వార్తలు వస్తున్నాయి.దీనిపై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, సోషల్ మీడియాలో ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ



నడుస్తోంది. ఇటీవలే అఖిల్ 'లెనిన్' నుండి కూడా శ్రీలీల తప్పుకున్న సంగతి తెలిసిందే. దాదాపు వారం రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొన్న తర్వాత, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆమె ఈ సినిమా నుండి తప్పుకోవాల్సి వచ్చింది.

ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే తన నటనతో, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ సినిమా సూపర్ హిట్ కావడంతో, శ్రీలీల ఒక మంచి అవకాశాన్ని చేజార్చుకుందంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం ప్రారంభించారు.

## అక్కినేని ఈవెంట్లో నందమూరి నినాదాలు!

అయితే ఈ అక్కినేని హీరో ఈవెంట్‌లో ఊహించని రీతిలో నందమూరి అభిమానుల హంగామా, నినాదాలు వినిపించడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అక్కినేని అఖిల్ నటించిన లేటెస్ట్ కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయంతో దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన ఘన విజయానికి కృతజ్ఞతగా నేడు (జూలై 15న) ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు నగరంలో చిత్ర యూనిట్ అత్యంత అట్టహాసంగా 'లెనిన్ సక్సెస్ మీట్' నిర్వహించింది. ఈ ఈవెంట్ లైవ్ ప్రసారంలో ఊక వేస్తే రాలనంత మంది అభిమానులు తరలివచ్చి థియేటర్ పరిసరాలను



జనసంద్రంగా మార్చేశారు. అయితే ఈ అక్కినేని హీరో ఈవెంట్‌లో ఊహించని రీతిలో నందమూరి అభిమానుల హంగామా, నినాదాలు వినిపించడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది స్టార్ హీరో కోరికపై నెటిజనుల చర్చ! అఖిల్ ఈవెంట్‌లో 'జై బాలయ్య.. జై ఎన్టీఆర్' నినాదాలు! ఈ గుంటూరు సక్సెస్ మీట్ లైవ్‌లో అక్కినేని అభిమానులతో పాటు భారీ సంఖ్యలో నందమూరి అభిమానులు కూడా పాల్గొనడం విశేషం. ఈవెంట్ జరుగుతున్నంత సేపూ గాల్లోకి ప్లకార్డులు లేపుతూ, "జై బాలయ్య.. జై ఎన్టీఆర్" అంటూ నందమూరి ఫ్యాన్స్ సృష్టించిన హంగామా అంతా ఇంతా కాదు. గుంటూరు, విజయవాడ బెల్ట్‌లో నందమూరి కుటుంబానికి, ముఖ్యంగా బాలకృష్ణ -యంగ్ టైగర్ ఎన్టీఆర్‌లకు ఉన్న తిరుగులేని ప్రజాదరణ, ఫ్యాన్ బేస్ బలం ఏపాటిదో ఈ ఈవెంట్ ద్వారా మరోసారి స్పష్టమైంది. అఖిల్ సినిమా ఫంక్షన్‌ను సైతం తమ నినాదాలతో నందమూరి ఫ్యాన్స్ హోరెత్తించారు. నందమూరి ఫ్యాన్స్ ఈ రేంజ్‌లో సపోర్ట్ చేయడానికి కారణం ఇదే! అక్కినేని హీరో వేదికపై నందమూరి నినాదాలు మార్మోగడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. 'లెనిన్' చిత్రంలో యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ తన పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్ అందించారు. సినిమా ప్రారంభంలో వచ్చే ఎన్టీఆర్ వాయిస్ థియేటర్లలో ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించడమే కాకుండా... సినిమా విజయానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సానుకూల కారణంతోనే.. ఎన్టీఆర్ అభిమానులు -నందమూరి ఫ్యాన్స్ అంతా కలిసి అఖిల్ సక్సెస్ మీట్‌లో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకుంటూ ఈ ఈవెంట్‌ను సక్సెస్ చేశారు. గుంటూరు వేదికకు.. అక్కినేని హీరోలకు ఉన్న బలమైన కనెక్షన్ గుంటూరు నగరానికి అక్కినేని కుటుంబానికి దశాబ్దాల నాటి అనుబంధం ఉంది. లెజెండ్ అక్కినేని నాగేశ్వరరావు కాలం నుండి గుంటూరు జిల్లా అక్కినేని హీరోలకు తిరుగులేని కోటగా నిలిచింది. గతంలో కింగ్ నాగార్జున నటించిన ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాల శతదినోత్సవ వేడుకలు, ఆడియో ఫంక్షన్లు గుంటూరు వేదికగానే జరిగి రికార్డులు సృష్టించాయి. ఇప్పుడు అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ.. అఖిల్ తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ కమర్షియల్ హిట్ సాధించిన 'లెనిన్' విజయోత్సవాన్ని

గుంటూరు నడిబొడ్డున జరుపుకోవడం అక్కినేని అభిమానులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల అయ్యగారి ర్యాంపేజ్.. సరికొత్త రికార్డుల దిశగా! టాలీవుడ్ యంగ్ అండ్ హ్యాండ్సమ్ హీరో అఖిల్ అక్కినేని ఎట్టకేలకు తన కెరీర్‌లో ఆశించిన మాస్ కమర్షియల్ హిట్‌ను ఈ చిత్రం ద్వారా సొంతం చేసుకున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా తెరకెక్కిన ఈ రూరల్ యాక్షన్ డ్రామా మొదటి మూడు రోజుల్లోనే రూ. 61.1 కోట్ల భారీ గ్రాస్ వసూలు చేసి అఖిల్ బాక్సాఫీస్ సత్తాను చాటిచెప్పింది. గుంటూరు ఈవెంట్‌తో వచ్చిన భారీ మైలేజ్ సినిమా వసూళ్లను లాంగ్ రన్‌లో మరింత పెంచడం ఖాయంగా కనిపిస్తోంది.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197